క్లుప్తంగా

సమాన పనికి సమాన వేతనమివ్వాలి



మాట్లాడుతున్న నాగభూషణం

గుత్తి: మున్సిపల్ కార్మికులందరికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం డిమాండ్ చేశారు. గుత్తిలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన సమ్మె మంగళవారం రెండో రోజుకు చేరుకుంది. ముఖ్య అతిథిగా నాగభూషణం హాజరై మాట్లాడారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, జీఓ 36 ప్రకారం వేతనాలివ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియాకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రాజా, ఆది, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను కలసిన ఎస్సీ సెల్ నాయకులు



వైఎస్ జగన్‌తో ఎస్సీసెల్ నాయకులు

గుంతకల్లుటౌన్: మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ జిల్లా కార్యదర్శి నాగేంద్ర, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు పెయింటర్ నరేష్, నాయకులు బావన్న, పెయింటర్ హరి, ముని, ఆంథోని కలసి శాలువా కప్పి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ కోసం కష్టపడి పనిచేయాలని అధినేత సూచించారన్నారు.

పుట్లూరు రైల్వే గేట్ బంద్

తాడిపత్రి రూరల్: మరమ్మతుల కారణంగా పుట్లూరు రైల్వే గేట్‌ను బంద్ చేశామని అధికారులు తెలిపారు. 15వ తేదీ ఉదయం 8 గంటల నుంచి 16వ తేదీ రాత్రి 8 గంటల వరకూ రైల్వే గేట్ మూసివేశామన్నారు. వాహనాల రాకపోకలను అనంతపురం రోడ్డులోని రైల్వే బ్రిడ్జి నుంచి కొనసాగించాలని వారు తెలిపారు.

కేజీబీవీలో యువత నైపుణ్యాల దినోత్సవం



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

పుట్లూరు: మండలకేంద్రంలోని కేజీబీవీలో మంగళవారం ప్రపంచ యువత నైపుణ్యాల దినోత్సవం (వరల్డ్ యూత్ స్కిల్ డే) ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థినులకు ఒకేషనల్‌కు సంబంధించి క్విజ్, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. విజేతలకు స్పెషలాఫీసర్ మాధవి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సీఆర్టీలు పాల్గొన్నారు.

18న చలో ఢిల్లీ

గుంతకల్లుటౌన్: ఏపీ పునర్విభజన హామీలు, ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ అనుమతులు కోరుతూ డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో జూలై 18న నిర్వహించనున్న ఛలో ఢిల్లీ కార్యక్రమానికి నిరుద్యోగ యువత తరలిరావాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రమేష్, పట్టణ కార్యదర్శి సురేంద్ర కోరారు. మంగళవారం సీపీఎం కార్యాలయంలో ఛలో ఢిల్లీ కార్యక్రమ కరపత్రాలను వారు విడుదల చేశారు.

పెద్దబాదుల్లాస్వామి చివరి దర్శనం



పెద్దబాదుల్లా స్వామిని చూపుతున్న ముజావర్లు

పెద్దపప్పూరు: మొహర్రం ఉత్సవాల్లో భాగంగా కొట్టాలపల్లిలో భక్తులకు మంగళవారం పెద్దబాదుల్లాస్వామి చివరి దర్శనాన్ని ముజావర్లు పక్రుదిన్, హాజీపీరా కల్పించారు. ఏటా స్వామి వారి చివరి దర్శనం కల్పించడం ఇక్కడ ఆనవాయితీ. అనంతరం స్వామివారికి చదివింపులు చేసి ప్రత్యేక బాక్సులో భద్రపరిచారు.

ఘనంగా చిన్న మొహర్రం వేడుకలు

పామిడి: పామిడిలో ఎనిమిది రోజులుగా చిన్న మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం 8వ ఖాన్‌లో భాగంగా స్థానిక కటిక వీధిలోని చిన్న మౌలాలి పీర్ల స్వాములను శోభాయానంగా అలంకరించారు. భక్తులు చక్కెర చదివించి మొక్కులు తీర్చుకున్నారు.

బాబు మోసాలను ప్రజలకు వివరిద్దాం

- బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ
- క్యూఆర్ కోడ్ ఆవిష్కరించిన సమన్వయకర్త సాకే శైలజనాథ్





నార్పల, శింగనమలలో రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో క్యూ ఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి సాకే శైలజనాథ్, నాయకులు

నార్పల: కూటమి ప్రభుత్వ అరాచకాలు, మోసాలను ప్రజలకు వివరిద్దామని శింగనమల సమన్వయకర్త, మాజీ మంత్రి సాకే శైలజనాథ్ అన్నారు. సూపర్ సిక్స్ సహా ఎన్నికల హామీల అమలు, పాలనలో పూర్తిగా విఫలమై ప్రజాస్వామ్యం పీక నులుముతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ష్యూరిటీ అంటే మోసాలే కాదు అవినీతి, అక్రమాలు, అపద్ధపు హామీలు గ్యారెంటీ అని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాన్ని మండల కేంద్రంలో మంగళవారం జరగనుండగా టీడీపీ పార్టీ పోలీసులను అడ్డుపెట్టుకొని జరగకుండా ప్రయత్నించింది. కానీ ఎన్ని అవంతరాలు ఎదురైనా తగ్గని వైఎస్సార్‌సీపీ నాయకులు వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫేస్టో కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శైలజనాథ్ మాట్లాడుతూ టీడీపీ నాయకులకు చేతనైతే ప్రజలకు మంచి చేయండి అంతే కానీ దౌర్జన్యం చేస్తే అంతకు పదింతలు వడ్డీ సహా చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అలాగే మా కార్యకర్తల జోలికి వస్తే మాత్రం ఊరుకునేది లేదన్నారు. అనంతరం కూటమీ ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతి, అక్రమాలు, అరచకాలను ప్రజలకు వివరించారు. చివరగా రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి, ఎంఎస్ఎంఈ రాష్ట్ర మాజీ డైరెక్టర్ రఘునాథ్‌రెడ్డి, మండల కన్వీనర్ ఖాదర్‌వలీఖాన్, జెడ్పీ వైస్‌చైర్మన్ నాగరత్నమ్మ, ఎంపీపీ నాగేశ్వరావు, బండ్లపల్లి ప్రతాప్, లోక్‌నాథ్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, వార్డ్ మెంబర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాబోయే ముఖ్యమంత్రి జగనే

శింగనమల: రాబోయే ప్రభుత్వం వైఎస్సార్‌సీపీదీ...ఈ రాష్ట్రానికి కాబోయే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని, కూటమి ప్రభుత్వం చేసిన తప్పులకు ప్రజాస్వామ్య పద్ధతిలో శిక్ష అనుభవించక తప్పదని మాజీ మంత్రి , నియోజకవర్గ వర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్ హెచ్చరించారు. మంగళవారం శింగనమలలోని వాసవీ కల్యాణ మండపంలో మండల కన్వీనర్ పూల ప్రసాద్ అధ్యక్షతన రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. శైలజానాథ్ మాట్లాడుతూ గుడివాడలో జెడ్పీ చైర్ పర్సన్ మీద హత్య ప్రయత్నం జరిగితే, బాధితులపైనే హత్య ప్రయత్నం కేసు నమోదు చేశారని, దాడి చేసిన వారిపై స్టేషన్ బెయిల్ కేసు నమోదు చేశారన్నారు. సంవత్సరం పాటు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా రూ. 75 వేల కోట్లు మిగిల్చుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలకు దిక్కు లేదన్నారు. నిరుద్యోగ భృతి ఎక్కడన్నారు. తల్లికి వందనం పథకం 30 లక్షలు మందికి మాయం చేశారని, ఆడబిడ్డ నిధి ఇవ్వకుండా మిగిల్చుకుంటున్నారన్నారు. అన్నదాత సుఖీభవ రూ.20 వేలు ఎక్కడనని ప్రశ్నించారు. దీపం పథకంలో సిలిండర్లు వస్తున్నాయని, డబ్బులు రావడం లేదని అక్క చెల్లమ్మలే మాట్లాడుకుంటున్నారని విమర్శించారు. ఉచిత బస్సు ఆగస్టు నుంచి అమలు చేస్తామంటున్నారని, అదీ జిల్లాకే పరిమితం అంటున్నారని ఎద్దేవా చేశారు. 50 సంవత్సరాలకే పింఛన్ ఇస్తామన్నారు. మరి ఈ పథకం ఎక్కడనని ప్రశ్నించారు. చంద్రబాబు కేవలం అబద్ధాలు చెప్పుతున్నారని, వీటిని ఎత్తి చూపడానికీ రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేసేది ఒక్క వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తరిమెల భాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ నీలం భాస్కర్, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తరిమెల వంశీగోకుల్ రెడ్డి, బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి, వైస్ ఎంపీపీ నరసింహులు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు నూరు మహమ్మద్ , ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

‘సేవ్ ఆర్డీటీ’పై కొనసాగుతున్న దీక్షలు

పామిడి: పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో ఐక్యమాదిగ సమాజ్ ఆధ్వర్యంలో వంద గంటల రిలే నిరాహార దీక్షలు మంగళవారం రెండోరోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆ సమాజ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వంకరాజుకాలువ వెంకటేష్‌తో పాటు తపాల లక్ష్మి, ఎం. సూర్యనారాయణ, కేశం, శంకర్, రాజ్‌కుమార్ రిలే దీక్ష చేపట్టారు. ఈసందర్భంగా వంకరాజుకాలువ వెంకటేష్ మాట్లాడారు. పేదల ఆశాజ్యోతి, పెన్నిధి అయిన ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరణ కోసం రిలేదీక్షలు చేపట్టామన్నారు. దీక్షలకు ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యులు నెరమెట్ల ఎల్లన్న, ఆ కమిటీ ఫోరమ్ నాయకులు రామాంజనేయులు, బీబీఎస్ ఓబులేసు, ఎంఎస్ఎఫ్ నాగేష్, శివశంకర్ సంఘీభావం తెలిపారు.

ప్రభుత్వానికి నివేదించండి

సేవ్ ఆర్డీటీపై ఐక్య మాదిగ సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలను ప్రభుత్వం దృష్టికి తేవాలని ఆ సమాజ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వంకరాజుకాలువ వెంకటేష్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన తహసీల్దార్ సీ షర్మిలకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఆ సమాజ్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ అక్రమ కనెక్షన్ తొలగించండి

యాడికి: మండలంలోని పుప్పాల గ్రామ సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలంలో ఉన్న కుంట నీటిని అక్రమంగా విద్యుత్ కనెక్షన్ తీసుకుని మోటార్ ద్వారా దౌర్జన్యంగా తోటలకు వాడుకుంటున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని గుత్తిలో విద్యుత్ డీఈకి పుప్పాల గ్రామస్తులు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా పుప్పాల గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామ సమీపంలో ఉన్న కుంటలో పశువులు, గొర్రెలు దాహార్తిని తీర్చుకునేవన్నారు. ఇటీవల గ్రామానికి చెందిన దేవేంద్ర అనే రైతు అక్రమంగా కరెంటు మీటరు బిగించి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకుని, ఆ నీటిని మోటార్‌తో తన సొంత భూమికి వాడుకుంటున్నాడన్నారు. దీంతో గ్రామంలోని మూగ జీవాలు కుంటలోకి పోలేక నీటి కోసం అలమటిస్తున్నాయన్నారు. యాడికి తహసీల్దార్, విద్యుత్ ఏఈకి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, మీరైనా విద్యుత్ వైర్లను తొలగించి పశువుల దాహార్తిని తీర్చాలని వేడుకున్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో పుప్పాల గ్రామానికి చెందిన దొడ్డి దేవేంద్ర, ప్రసాద్, లక్ష్మిరంగారెడ్డి, గంగరాజు, సుదర్శన్‌తో పాటు మరో 13మంది ఉన్నారు.

గుండెపోటుతో టీపీఆర్ ట్రస్ట్ అధినేత మృతి



పరశురాముడి మృతదేహానికి నివాళులర్పిస్తున్న మంజునాథ్‌రెడ్డి

గుంతకల్లు: తలారి పరశురాముడు ట్రస్ట్ (టీపీఆర్) అధినేత తలారి పరశురాముడు (56) గుండెపోటుతో అకస్మిక మృతి చెందాడు. వివరాలు. మంగళవారం నార్పల మండలంలోని గూగూడులో రెండో కుమారుడు తేజ కందూరి చేస్తున్న నేపథ్యంలో కుటుంబసభ్యులతో కలిసి ఆయన వెళ్లాడు. కుళ్లాయస్వామి పూజకు సిద్ధమవుతున్న తరుణంలో పరశురాముడు ఒక్కసారిగా కుప్పకూలాడు. వెంటనే కుటుంబసభ్యులు అనంతపురంలోని ఓ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అనంతరం పరశురాముడు మృతదేహాన్ని గుంతకల్లుకు తరలించారు. పరశురాముడు, శంకుతల దంపతులకు పిల్లలు రాణా, తేజ, రాజు ఉన్నారు. విషయం తెలుసుకున్న కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సీబీ మంజునాథ్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు దశరథరెడ్డి, నూర్‌నిజామితోపాటు పట్టణ ప్రముఖులు తదితరులు పరుశురాముడు మృతదేహన్ని సందర్శించి నివాళులర్పించారు. కాగా ఆయన టీపీఆర్ ట్రస్ట్‌ను స్థాపించి ఎన్నో సేవలు అందించారు. గుంతకల్లు మండలలోని నెలగొండ, కర్నూలు జిల్లా చిప్పగిరి గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలకు ఆయా గ్రామాల్లో దాదాపు 10 సెంట్ల మేర స్థలాన్ని ఉచితంగా ప్రభుత్వానికి అందజేశారు. ఇటీవలే కసాపురం నెట్టికంటి ఆంజినేయస్వామి గుడి సమీపంలో కోట్లాది రూపాయలు ఖర్చుచేసి లక్ష్మీనారాయణ ఆలయం కట్టించడంతోపాటు భక్తులకు ఉచితంగా భోజన సదుపాయం కల్పించారు.



తలారి పరశు రాముడు (ఫైల్)

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



పెద్దమల్లేపల్లిలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ శివశంకర్

యల్లనూరు: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా రోగాలు దరిచేరవని జెడ్పీ సీఈఓ శివ శంకర్ సూచించారు. మంగళవారం పెద్దమల్లేపల్లి పంచాయతీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా చెత్తసంపద కేంద్రాన్ని పరిశీలించారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ రోడ్లపై వేస్తే ఊరుకోబోమన్నారు. అలాగే చెత్త సేకరణ ఎలా ఉందని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తెలపాలన్నారు. గ్రీన్ అంబాసిడర్లు పని తీరు, సేకరించిన చెత్తను ఎలా వినియోగిస్తున్నారనే అంశాల గురించి ఆరా తీశారు. పీఎం కొండాపురంలో ప్రధాన రహదారి పక్కనే ఉన్న చెత్త దిబ్బలు, పేడ దిబ్బలను తొలగించాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వాసుదేవరెడ్డి, డిప్యూటీ ఎంపీడీఓ మనోహర్‌బాబు, పంచాయతీ కార్యదర్శి సురేష్, ప్రజలు పాల్గొన్నారు.

చెన్నంపల్లిలో అర్ధరాత్రి పోలీసుల ఓవరాక్షన్



బుక్కరాయసముద్రం పీఎస్‌లో డీఎస్పీతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శైలజనాథ్

బుక్కరాయసముద్రం: మండలంలోని చెన్నంపల్లిలో పోలీసులు సోమవారం అర్ధరాత్రి ఓవరాక్షన్‌తో భయానక వాతావరణం నెలకొంది. ఈ నెల 8న మహానేత వైఎస్సార్ జయంతిని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఆనందంగా జరుపుకున్నారు. ఈ విషయాన్ని జీర్ణించుకోలేక టీడీపీ నాయకులు దాదాపు 25 మంది 9వ తేదీ కట్టెలు, కొడవళ్లతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఇళ్లపైకి దాడులకు తెగబడ్డారు. ఈ ఘటనలో గాయపడిన వారందరూ ప్రస్తుతం అనంతపురంలోని జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి గ్రామానికి చేరుకున్న పోలీసులు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సానుభూతిపరుల ఇళ్లలో సోదాలు చేపట్టి గోపాల్, ఈశ్వరయ్య, సురేష్ బాబు, వెంకటరమణ, గోవిందరెడ్డి, నాగరాజు, మహేశ్వరరెడ్డి, సాకే మల్లికార్జునను అరెస్ట్ చేసి, పీఎస్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త శైలజనాథ్ మంగళవారం పీఎస్‌కు చేరుకుని పోలీసుల తీరుపై మండిపడ్డారు. టీడీపీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి గొడవలో సంబంధం లేని వారిని కేసులో ఇరికించి ప్రయత్నం చేస్తున్నారంటూ అసహనం వ్యక్తం చేశారు. పార్టీ అండగా ఉంటుందని బాధిత మహిళలకు భరోసా ఇచ్చారు. కాగా, అరెస్ట్ చేసిన వారిని పోలీసులు న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

యాడికిలో కేంద్ర బృందం పర్యటన



యాడికి జెడ్పీహెచ్‌ఎస్ సిబ్బందితో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

యాడికి: గ్రామీణ స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమానికి ఎంపికైన యాడికి, చందన గ్రామ పంచాయతీలను మంగళవారం కేంద్ర బృందం అధికారి రామచంద్ర పరిశీలించారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్, ప్రభుత్వాస్పత్రి, అంగన్‌వాడీ కేంద్రం, గ్రామ పంచాయతీ కార్యాలయం, దేవాలయాలు, గృహాలు, డంపింగ్ యార్డును పరిశీలించారు. పాఠశాలల్లో విద్యార్థులకు టాయిలెట్ సౌకర్యం, హ్యాండ్ వాష్ సౌకర్యం, పంచాయతీల ద్వారా చెత్త సేకరణ, వ్యర్థ జలాలు లేకుండా చూడాలని, శుభ్రతా ఫొటోకాల్‌లు, సిబ్బంది శిక్షణ, పురుషులు, స్త్రీలు, వికలాంగులకు వేర్వేరు టాయిలెట్ల ఏర్పాటుపై అవగాహన కల్పించారు. ఈఓ శశికళ, హెచ్‌ఎం సీతారామాంజనేయులు, వైద్యుడు సుమంత్ రెడ్డి, అంగన్‌వాడీ సిబ్బంది, పంచాయతీ కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఘనంగా ఆషాఢ పూజలు

గుంతకల్లు: పట్టణంలోని కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో ఆషాఢ మాసం మూడో శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు వేకువజామునే వాసవీ మాత అమ్మవారు మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వాసవీమాత మూలవిరాట్‌కు తొలిసారిగా వివిధ రకాలు ఫలాలు, పుష్పాలతో అలంకరించారు. వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

పెద్దవడుగూరు: మండలంలోని లక్ష్ముంపల్లి జెడ్పీ పాఠశాలలో పని చేస్తూ బదిలీ అయిన ఉపాధ్యాయులను మంగళవారం ప్రధానోపాధ్యాయుడు శేషాచలం, పాఠశాల కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బదిలీ అయిన ఉపాధ్యాయులు ముక్కర హరినాథ్, ఆదినారాయణ, నాగరాజు, విజయ్‌కుమార్, శ్రీనాథ్, సురేష్‌బాబు, వెంకట్రామిరెడ్డి, ఆంజినేయులు, సుజాత తదితరులు పాల్గొన్నారు.

నేడు 1కే ర్యాలీ

తాడిపత్రి రూరల్: మధ్యవర్తిత్వంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు బుధవారం ఉదయం 9 గంటలకు 1కే ర్యాలీ ఏర్పాటు చేశామని మెజిస్ట్రేట్ అనిల్‌కుమార్ మంగళవారం తెలిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు కోర్టు ఆవరణ నుంచి ప్రారంభమయ్యే ర్యాలీకి న్యాయవాదులు, కోర్టు సిబ్బంది హాజరు కావాలన్నారు.

హెచ్చెల్సీలో పూడికతీత పనుల పరిశీలన

పెద్దవడుగూరు/తాడిపత్రి టౌన్: పెద్దవడుగూరు మండలంలోని లక్ష్ముంపల్లి సమీపంలోని యాడికి కాలువ పూడిక తీత పనులను ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు కాలువ అభివృద్ధి పనులకు సహకరించాలన్నారు. యాడికి కాలువ ద్వారా రాయలచెరువుకు కూడా సాగు నీరందించడానికి కృషి చేస్తామని అన్నారు. హెచ్చెల్సీ అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. అలాగే తాడిపత్రి మండలంలోని వీరాపురంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఎమ్మెల్యే ప్రారంభించారు. ట్రాన్స్‌కో అధికారులు మాట్లాడుతూ సబ్ స్టేషన్ ఏర్పాటు వల్ల వీరాపురం, బొందలదిన్నె, కొండేపల్లి, వంగనూరు, బోడాయిపల్లి గ్రామాల్లో వ్యవసాయ, గృహాలకు నాణ్యమైన విద్యుత్ అందుతుందన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో అధికారులు పద్మనాభ పిళ్లై, రవిశంకర్, ఏడీ ప్రభాకర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

తాడిపత్రిరూరల్: పట్టణంలోని ఆగ్రో బాలాజీ, మాకం, రంగేశ్వర ఎరువుల దుకాణాల్లో కమిషనరేట్ ఏడీఏ సాలురెడ్డి, తాడిపత్రి ఏడీఏ రవి, ఏఓ ఆంజనేయులు, విజిలెన్స్ ఎస్ఐ నరేంద్ర భూపతి, టెక్నికల్ ఏఓ రాకేష్ తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, బిల్లు పుస్తకాలను పరిశీలించారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

ఎస్కేపీ డిగ్రీ కాలేజీలో బీఎఫ్ఎస్ఐ కోర్సు

గుంతకల్లుటౌన్: ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల(స్వయం ప్రతిపత్తి) కళాశాల కామర్స్ విభాగంలో ఈ విద్యా సంవత్సరం నుంచి బీకాం బీఎఫ్ఎస్ఐ(బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సురెన్స్) కోర్సును ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ కోర్సు మూడు సంవత్సరాల కాలవ్యవధి కలదని, తృతీయ సంవత్సరంలో విద్యార్థులకు పట్టణ పరిధిలోని ప్రభుత్వ రంగ, ప్రైవేట్ బ్యాంకుల్లో స్టైఫండ్‌తో కూడిన అప్రెంటిషిప్ శిక్షణ ఇస్తామన్నారు. ఈ కోర్సు పూర్తి చేయడం ద్వారా విద్యార్థులు బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ కంపెనీల్లో ఉద్యోగాలు పొందే అవకాశముందన్నారు. వివరాలకు కామర్స్ అధ్యాపకులు రాఘవేంద్ర, అల్తాఫ్‌నుసంప్రదించాలన్నారు.


అధిక లోడ్‌తో వెళ్తే కేసులు

గార్లదిన్నె: వాహనాలు అధిక లోడ్‌తో వెళ్తే కేసులు నమోదు చేస్తామని ఆర్టీఓ సునీత హెచ్చరించారు. మంగళవారం మండలంలోని తిమ్మంపేట గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారిపై పోలీసులు, రోడ్డు రవాణ శాఖ అధికారులు వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాలు ఆపి, రికార్డులు పరిశీలించారు. రికార్డులు సక్రమంగా లేని వాహనదారులకు జరిమానా విధించారు. కార్యక్రమంలో ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి: పట్టణంలోని అనంతపురం రోడ్డులో మంగళవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. అబ్బేదొడ్డి గ్రామానికి చెందిన ప్రకాష్‌రెడ్డి, కౌలు పల్లికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి బైక్‌లో గుత్తి నుంచి అనంతపురం బయలు దేరారు. అయితే మార్గమధ్యంలో రోడ్డుకు అడ్డంగా కుక్క వచ్చింది. కుక్కను తప్పించబోయి బైక్ బోల్తా పడింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి రెఫర్ చేశారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆర్థిక లావాదేవీలు, అక్రమ సంబంధాలే హత్యకు కారణమా ?



హర్షవర్ధన్(ఫైల్)

తాడిపత్రిటౌన్: హర్షవర్ధన్ అనే యువకుడి హత్య కేసులో ఆర్థిక లావాదేవిలతో పాటు అక్రమ సంబంధాలే ప్రధాన కారణం అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. తాడిపత్రి పట్టణంలోని కాల్వగడ్డ వీధిలో సోమవారం రాత్రి రెడ్డివారిపాళెంకు చెందిన హర్షవర్ధన్‌ను బిందెలకాలనీకి చెందిన నాగరాజు తోపాటు మరికొంత మంది వేటకొడవళ్లతో నరికిన సంఘటన తెలిసిందే.. తీవ్ర గాయాలపాలైన హర్షవర్ధన్(28) అనంతపురంలో చికిత్సపొందుతూ మృతిచెందాడు. హత్యకు గల కారణాలపై పోలీసులు విచారణ చేపట్టారు. హర్షవర్ధన్, నాగరాజు కలిసి గత కొంత కాలంగా రియల్‌ఎస్టేట్ చేస్తుండేవారు. వారి మధ్య ఆర్థిక లావాదేవీలపై ఈ మధ్యకాలంలో తరచూ గొడవలు చోటు చేసుకున్నాయి. అలాగే వీరిద్దరి అక్రమ సంబంధాల విషయాలు కూడా బయటకు వస్తుండటంతో కోపానికి గురైన నాగరాజు మరికొంత మందితో కలిసి హర్షవర్ధన్‌పై వేటకొడవలితో దాడిచేశాడు. కాగా హర్షవర్ధన్‌పై దాడి అనంతరం అజ్ఞాతంలోకి వెళ్లిన నాగరాజు మంగళవారం ఉదయం తాడిపత్రి కోర్టులో లొంగిపోయాడని పోలీసులు తెలిపారు. హర్షవర్ధన్‌కు భార్య సౌమ్య, కుమారుడు ఉన్నారు.

వైభవంగా పామిడమ్మ హారతి



అలంకరణలో పామిడమ్మ

పామిడి: పట్టణంలోని పామిడమ్మ ఆలయంలో మంగళవారం పామిడమ్మ హారతిని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని శోభాయానంగా అలంకరించారు. పూజారి అజయ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఏటా రుక్మిణీ పాండురంగస్వామి బ్రహ్మోత్సవాల అనంతరం వచ్చే మంగళవారం పామిడిమ్మ హారతిని నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీ. ఉదయాన్నే అమ్మవారి దర్శనం కోసం భక్తులు ఆలయానికి తరలివచ్చారు. భక్తిప్రపత్తులతో వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి అభిషేక, అర్చనల అనంతరం ఆకుపూజ కట్టారు. ఈసందర్భంగా పామిడమ్మకు భావసార క్షత్రియులు హారతులు ఇచ్చారు. ఆలయ ప్రాంగణంలోని వేపచెట్టుకు భక్తులు ప్రదక్షిణలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు బోనాలు



బోనాలు మోసుకెళ్తున్న మహిళలు

శింగనమల: మండలంలోని సోదనపల్లిలో మంగళవారం దుర్గమ్మకు బోనాలు సమర్పించారు. వర్షాలు సకాలంలో కురవాలని, పంటలు బాగా పండాలని, పూజలు నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి మహిళలు బోనం మోసుకుని ఊరేగింపుగా దుర్గమ్మ ఆలయానికి వచ్చారు. దుర్గమ్మకు బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి అభిషేకం

గుత్తి: గుత్తి కోటలోని నేసే వీధిలో ఉన్న పురాతన ఆంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం వర్షం కోసం 107 బిందెలతో ఆంజనేయస్వామికి జలాభిషేకం చేశారు. నేసే వీధికి చెందిన మహిళలు, పురుషులు 107 బిందెలతో అభిషేకం చేశారు. కార్యక్రమంలో కాలనీ వాసులు శేషు, దాసా రమేష్ బాబు, రాము, వెంకటేష్, నాగరాజు, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



పచ్చకర్పూరంతో శుద్ధి చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

గుంతకల్లుటౌన్: పట్టణంలోని రాజేంద్రనగర్‌లో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం సేవలో భాగంగా ఆలయాన్ని పచ్చ కర్పూరంతో శుద్ధిచేశారు. ఏటా నాలుగు పర్యాయాలు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ కార్యదర్శి నారాయణస్వామి, కోశాధికారి సుధాకర్ గుప్త తెలిపారు. కార్యక్రమంలో ప్రసాద కమిటీ చైర్మన్ జయంతి వెంకట్, సభ్యులు ప్రవీణ్, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంపై ఎంఈఓల ఫిర్యాదు

గార్లదిన్నె: మండలంలోని పాత కల్లూరు ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం నరసింహులు, ఆయన కుమారుడు విశ్వనాథ్ తమపై దౌర్జన్యం చేశారంటూ ఎంఈఓలు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు. వివరాలు.. మంగళవారం ఎంఈఓ–1 చంద్రానాయక్, ఎంఈఓ–2 వెంకటరమణ నాయక్ ఇద్దరు ద్విచక్ర వాహనంలో పాఠశాల తనిఖీ కోసం వెళ్తుండగా ఉదయం 11.30 గంటలకు గుడ్డాలపల్లి క్రాస్ సమీపంలోకి చేరుకోగానే హెచ్‌ఎం నరసింహులు మరో ద్విచక్రవాహనంలో వెనుకల కూర్చొని కల్లూరు వైపు వెళ్తున్నట్లు గుర్తించారు. దీంతో ద్విచక్ర వాహనం ఆపాలని ఎంఈఓలు కోరినా ఆపకుండా హెచ్‌ఎం పాఠశాలకు వెళ్లిపోయారు. ఎంఈఓలు కూడా పాఠశాలకు చేరుకుని హెచ్‌ఎం నరసింహులతో మాట్లాడుతూ.. పాఠశాల సమయంలో ఎందుకు బయటకెళ్లారని ప్రశ్నిస్తుండగానే అక్కడే ఉన్న హెచ్‌ఎం కుమారుడు విశ్వనాథ్ ఎంఈఓల సెల్ ఫోన్ లాక్కొని కిందకు పడేసి దౌర్జన్యానికి దిగాడు. దీంతో ఎంఈఓల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. కాగా, హెచ్‌ఎం నరసింహులు తమకు అందాల్సిన ఇంక్రిమెంట్లు విషయంగా ఇప్పటికే హైకోర్టులో కేసు వేసినట్లు సమాచారం.